సాక్షి
వికారాబాద్

శుక్రవారం । 29 । సెప్టెంబర్ । 2023



నాణ్యతకు తిలోదకాలు

ప్రభుత్వ పాఠశాలల భవనాల పునర్నిర్మాణ పనులు అధికారుల నిర్లక్ష్యంతో నాసిరకంగా మారుతున్నాయి. 8లో▸



ప్రపంచ శాంతికి కృషి

మహమ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకొని తాండూరు పట్టణంలో ముస్లింలు మిలాద్ ఉన్ నబీ నిర్వహించారు. 9లో▸



మురుగు మధ్యే జీవనం

పారిశుద్ధ్యం లోపించడంతో పరిగి పట్టణంలో చెత్తాచెదారం పేరుకుపోయింది. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

నిమజ్జనానికి సహకరించాలి

ఎస్పీ కోటిరెడ్డి



లక్నాపూర్ ప్రాజెక్టు వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ కోటిరెడ్డి

పరిగి: వినాయక నిమజ్జనాలు ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్పీ కోటిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని లక్నాపూర్ ప్రాజెక్టును సందర్శించి నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శోభాయాత్ర, నిమజ్జనంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 2,700 విగ్రహాలు ఏర్పాటు చేశారని, 9వ రోజు సగం విగ్రహాలను నిమజ్జనం చేశారని తెలిపారు. కార్యక్రమంలో సీఐ వెంకటరామయ్య, ఎస్సై సత్యనారాయణ, ఆర్‌ఐ వెంకట్‌రమణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి పండుగుల సాయన్న

ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాల ముకుందం



సాయన్న విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న నేతలు

కుల్కచర్ల: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి పండుగుల సాయన్న అని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాల ముకుందం అన్నారు. గురువారం కుల్కచర్లలో పండుగుల సాయన్న విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద, ధనిక అనే తారతమ్యాన్ని తొలగించాలన్న సంకల్పంతో ముందుకు సాగిన గొప్ప వ్యక్తి సాయన్న అని అన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, మండల అధ్యక్షుడు చంద్రలింగం, ఉపాధ్యక్షుడు మైపాల్, ప్రచార కార్యదర్శి నర్సింలు, సలహాదారులు ఆంజనేయులు, సంఘ నాయకులు మల్లయ్య, యాదయ్య, రఘు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి

పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ రాజవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న రాజవర్ధన్‌రెడ్డి

మోమిన్‌పేట: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ రాజవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం మోమిన్‌పేటలో పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి అధ్యక్షతన బూత్ స్వశక్తి అభియాన్‌లో భాగంగా సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ ఏ పథకం అమలు చేసినా పేదల కోసమే అని పేర్కొన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్డుతో పేదలు రూ. 5లక్షల వరకు కార్పొరేటు వైద్యం పొందవచ్చని తెలిపారు. దేశంలోని ప్రతి రైతుకూ రూ. 6వేలు పెట్టుబడి సాయం అందిస్తున్నట్లు తెలిపారు. అక్టోబర్ 1న మహబూబ్‌నగర్‌కు ప్రధాని మోదీ వస్తారని, అక్కడ జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాండు గౌడు, నాయకులు నవీన్‌కుమార్, అశిరెడ్డి, బుచ్చిరెడ్డి, చంద్రశేఖర్, మహిపాల్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ

కొందుర్గు: నిరుద్యోగ యువతీయువకుల నుంచి వృత్తివిద్యా కోర్సుల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లేడ్ చౌదరిగూడ ఎంపీడీఓ మహేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులై 19 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న నిరుద్యోగులు అర్హులన్నారు. అక్టోబర్ 3వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఎస్‌బీఐ రూరల్ ఎంప్లాయిమెంట్ ఆధ్వర్యంలో కార్ డ్రైవింగ్, సీసీటీవీ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తిగల వారు సంబంధిత సర్టిఫికెట్లతో చిలుకూరులోని గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ వద్ద హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 85001 65190, 79819 51167 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.



నిమజ్జనానికి బయలుదేరిన వినాయకుడు

వెళ్లిరావయ్యా.. ఉండ్రాలయ్యా..

పది రోజుల పాటు ప్రత్యేక పూజలందుకున్న గణనాథుడు గురువారం 11వ రోజు గంగమ్మ చెంతకు చేరారు. అంతకుముందు మండపాల వద్ద స్వామివారి మహా ప్రసాదానికి వేలం నిర్వహించారు. భక్తులు ఉత్సాహంగా పాల్గొని లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నారు. ఆ తరువాత శోభాయాత్ర నేత్రపర్వంగా సాగింది. చివరి ఘట్టంగా గణనాథుడిని నిమజ్జనం చేశారు.

– వికారాబాద్ అర్బన్



వికారాబాద్ గణేశ్ శోభాయాత్రలో నృత్యం చేస్తున్న మహిళలు, యువతులు

‘ఫేషియల్’ అయోమయం

- విద్యార్థుల ఫేషియల్ అటెండెన్స్‌కు సాంకేతిక సమస్యలు
- పది రోజుల క్రితం అమల్లోకి
- ఇంకా పూర్తికాని విద్యార్థుల రిజిస్ట్రేషన్
- ఒకరి ఫొటో స్థానంలో మరొకరిది
- సకాలంలో క్యాప్చర్ కాని చిత్రం
- ఇబ్బందుల్లో ఉపాధ్యాయులు



విద్యార్థిని ఫేషియల్ అటెండెన్స్ తీసుకుంటున్న ఉపాధ్యాయుడు

వికారాబాద్ అర్బన్: ప్రభుత్వ పాఠశాలలను గాడిలో పెట్టేందుకు విద్యాశాఖ సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి సారించింది. ఇందులో భాగంగానే గతంలో ఉపాధ్యాయుల హాజరు పారదర్శకంగా ఉండేందుకు బయోమెట్రిక్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ప్రస్తుతం విద్యార్థుల హాజరు శాతాన్ని కూడా మెరుగు పరచాలనే ఉద్దేశంతో ఫేషియల్ రికగ్నజేషన్ సిస్టం(ఎఫ్‌ఆర్‌సీ)ను ప్రవేశ పెట్టింది. ఈ పద్ధతిన విద్యార్థుల హాజరు తీసుకోవాలని ప్రభుత్వం విద్యాశాఖను ఆదేశించింది. ఇందులో భాగంగా ఉపాధ్యాయులకు శిక్షణ కూడా ఇచ్చారు. ఎఫ్‌ఆర్‌సీ యాప్‌ను ఉపాధ్యాయులు వారి సెల్ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఈ నెల 10వ తేదీ నుంచి ఎఫ్‌ఆర్‌సీ పద్ధతిన విద్యార్థుల హాజరు నమోదు చేయాలి. కానీ అత్యధిక పాఠశాలల్లో ఈ విధానం అమల్లోకి రాలేదు. జిల్లాలో ఇప్పటి వరకు కేవలం 65శాతం మాత్రమే విద్యార్థుల ఫేషియల్ అటెండెన్స్ నమోదు అవుతున్నట్లు తెలిసింది.

ఒక ఫొటో తీస్తే చాలు

పాఠశాలకు హాజరైన ప్రతి విద్యార్థిని ఫేషియల్ అటెండెన్స్ వేసుకోవాల్సిన అవసరం లేదు. తరగతి గదిలోని విద్యార్థులందరిని ఒకసారి ఫొటో తీస్తే అందులోని ప్రతి విద్యార్థి వ్యక్తి గత అటెండెన్స్ పడుతుంది. అయితే ఉపాధ్యాయులు ఈ విధానాన్ని అమలు చేయడంలో సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తెలిసింది. ఫేషియల్ అటెండెన్స్‌పై ఉన్నతాధికారులు అడిగితే సాంకేతిక సమస్యలను వివరిస్తున్నట్లు తెలిసింది. అయితే ఇందుకు సంబంధించిన యాప్‌లో ఒక ఫొటోకు బదులుగా మరొక ఫొటో రావడం, సకాలంలో ఫొటో క్యాప్చర్ కాకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఉపాధ్యాయులు అంటున్నారు. అంతేకాకుండా కొంతమంది విద్యార్థులకు ఆధార్ కార్డులు లేకపోవడం కూడా ఫేషియల్ అటెండెన్స్‌కు ఇబ్బందిగా మారినట్లు సమాచారం.

గందరగోళంగా యాప్

కొందరు విద్యార్థుల వ్యక్తిగత వివరాలు యాప్‌లో సరిగ్గా నమోదు చేయకపోవడంతో కూడా ఫేషియల్ అటెండెన్స్‌లో సమస్యలు తలెత్తుతున్నట్లు చెబుతున్నారు. యాప్‌లో కొన్ని సార్లు ఫుల్ సైజ్ ఫొటోలు రావడంతో స్క్రీన్ మొత్తం ఫొటో మాత్రమే కనిపిస్తోంది. దీంతో మిగతా ప్రక్రియా ఎలా పూర్తి చేయాలో ఉపాధ్యాయులకు అంతుపట్టడం లేదు. ఈ కారణంగా ఒకటి రెండు సార్లు ఫొటోలు తీయాల్సి వస్తుండడంతో ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. తరగతి గదిలోని విద్యార్థుల ఫేస్ మాత్రమే పడేలా ఫొటో తీయాల్సి ఉంటుంది. ఈ సమయంలో విద్యార్థుల వెనుక భాగంలో గోడలకు ఎలాంటి రంగులు, బొమ్మలు ఉండకూడదు. ఉపాధ్యాయులు ఇలాంటి జాగ్రత్తలు తీసుకోక పోవడంతో ఫేషియల్ అటెండెన్స్‌లో సమస్యలు వస్తున్నట్లు సమాచారం. కొన్ని చోట్ల సాంకేతిక సమస్యలు లేకపోయినా ఉపాధ్యాయులు ముఖ గుర్తింపు హాజరు తీసుకోవడంపై నిర్లక్ష్యం చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

తప్పుడు హాజరుకు చెక్

విద్యార్థులు పాఠశాలలకు రాకపోయినా కొందరు ఉపాధ్యాయులు వచ్చినట్లు అటెండెన్స్ వేస్తున్నట్లు ప్రచారంలో ఉంది. ఎఫ్‌ఆర్‌సీ పద్ధతి అమలు చేస్తే తప్పుడు హాజరుకు ఆస్కారం ఉండదు. కొత్త విధానం ద్వారా ప్రతి రోజూ ఎంత మంది విద్యార్థులు స్కూలు హాజరు అవుతున్నారు, ఎంత మంది అల్పాహారం తీసుకుంటున్నారు.. రాగి జావ ఎంత మందికి అందుతోంది వంటి వివరాలు కచ్చితంగా తెలిసి పోతుంది. అంతేకాకుండా మధ్యాహ్న భోజన పథకం అక్రమాలకు చెక్ పడుతుంది. అలాగే విద్యార్థుల పరీక్ష ఫలితాలు, ప్రగతి నివేదికలు కూడా తెలిసిపోతాయి. ఫేషియల్ అటెండెన్స్ అమల్లో ఉపాధ్యాయుల నిర్లక్ష్యాన్ని గమనించిన విద్యాశాఖ బుధవారం హెచ్‌ఎంలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించింది. విద్యార్థుల ఎఫ్‌ఆర్‌సీని విధిగా అమలు చేయాలని ఆదేశించింది. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించింది.

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి
- పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

కొడంగల్: సీఎం కేసీఆర్ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతోందని, ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పోషమ్మకుంట, అంగడి రాయిచూర్, ధర్మాపూర్, కస్తూరుపల్లి గ్రామాల్లో పర్యటించారు. రూ. 1.50కోట్లతో పోషమ్మకుంట – మైసమ్మ కుంట బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం రూ. 50లక్షలతో నిర్మించిన బ్రిడ్జిని ప్రారంభించారు. అంగడి రాయిచూర్‌లో సీసీ రోడ్డుకు, రూ. 2.70 కోట్లతో ధర్మాపూర్ – అంగడిరాయిచూర్ బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కస్తూరుపల్లిలో పాఠశాల ప్రహరీ, శ్మశానవాటికను ప్రారంభించారు. అనంతరం గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాయన్నారు. ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, రైతు బంధు, రైతు బీమా, సాగుకు ఉచిత విద్యుత్, మిషన్ భగీరథ, దళిత బంధు సమర్థవంతంగా అమలవుతున్నట్లు తెలిపారు. ప్రజలు కాంగ్రెస్ మాటలు నమ్మరాదని ఆ పార్టీ నాయకులు చెప్పేవి కాకమ్మ కథలేనని విమర్శించారు. గ్యారంటీ లేని కాంగ్రెస్ పార్టీ.. ప్రజలకు ఏమి గ్యారంటీ ఇస్తుందని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌కు మళ్లీ అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు శంకర్ నాయక్, గోవింద్, శిరీషా, వెంకట్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, రెండో వార్డు కౌన్సిలర్ మధు యాదవ్, నాయకులు రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

ఆత్మగౌరవం కోసమే భవనాలు

మంత్రి సబితారెడ్డి

తుక్కుగూడ: ప్రజల కోరికలకు కార్యరూపమే అన్ని కూలలకు ఆత్మగౌరవ భవనాల నిర్మాణమని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని ఈ–సిటీ వేంకటేశ్వర స్వామి, జిన్నాయిగూడ శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయాల అభివృద్ధి పనులకు, రావిర్యాలలో ఆయా కుల సంఘాల భవనాల నిర్మాణాలకు గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సీఎం కేసీఆర్ సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపటానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. పరిశ్రమల శాఖకు సంబంధించిన విలువైన భూమిని మంత్రి కేటీఆర్ సహకారంతో కులసంఘాల భవనాలకు కేటాయించామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా రూ.15 కోట్లతో కమ్యూనిటీ భవనాల నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. రావిర్యాలలో రోడ్ల అభివృద్ధికి రూ.4 కోట్లు, డ్వాక్రా భవనాలకు రూ.80 లక్షలు, ఆస్పత్రి, యువతకు క్రీడామైదానాలను మంజూరు చేస్తున్నామన్నారు. డబుల్‌బెడ్రూంలపై ప్రతిపక్ష పార్టీలు విద్వేషాలు రెచ్చగొట్టి, కులమతాల మధ్య చిచ్చు పెట్టడానికి ప్రయత్నం చేస్తున్నాయని దుయ్యబట్టారు. పేదలకు ఇళ్లు ఇస్తుంటే కోర్టులకు పోయి అభివృద్ధికి అడ్డంకులు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. కందుకూరులో 450 పడకలతో మెడికల్ కళాశాలకు అక్టోబర్ 1న శంకుస్థాపన చేయనున్నట్టు చెప్పారు. రూ.8 కోట్లతో నియోజకవర్గంలోని పురాతన దేవాలయాలను అభివృద్ధి చేస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర యువ నాయకుడు పి.కార్తీక్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు జల్లాల లక్ష్మయ్య యాదవ్, ఆలయాల చైర్మన్లు శ్రీనివాస్, శివశంకర్, డీఈఈ యాదయ్య, ఏఈఈ కె.భార్గవ్‌రెడ్డి, దేవాదాయ, మున్సిపల్ శాఖ అధికారులు, ఆయా కులసంఘాల అధ్యక్షులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

‘గృహలక్ష్మి’ వేగిరం

- దరఖాస్తుల పరిశీలన పూర్తి
- జిల్లా వ్యాప్తంగా వచ్చిన అర్జీలు 67,123
- అర్హులు 50,847మంది
- ఆన్‌లైన్‌లో నమోదు
- మొదటి విడతలో 12వేల మందికి అవకాశం

వికారాబాద్: ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని వేగవంతం చేసింది. వీలైనంత త్వరగా పథకం అమలు చేయాలని భావిస్తోంది. ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకం ఆశించిన స్థాయిలో మైలేజీ ఇవ్వక పోవడంతో గృహలక్ష్మి పథకం ద్వారా ఆ లక్ష్యాన్ని అందుకోవాలని చూస్తోంది. ఈ పథకం కింద ఎక్కువ మంది లబ్ధిదారులను ఎంపిక చేసి డబుల్ ఇళ్ల పథకం విషయంలో వెల్లువెత్తిన విమర్శలకు చెక్ పెట్టాలని భావిస్తోంది. ఇప్పటికే ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి పరిశీలన ప్రక్రియను పూర్తి చేసింది. అర్హులను గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. త్వరలో ఈ పథకానికి సంబంధించి అర్హుల ఖాతాల్లో డబ్బులు జమ చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకు అనుగుణంగా కలెక్టర్ పర్యవేక్షణలో జిల్లా యంత్రాంగం కసరత్తును ముమ్మరం చేసింది.

సొంత జాగా ఉన్న వారికే..

గృహలక్ష్మి పథకానికి ఎంపికై సొంత జాగా ఉన్న వారికి మొదటి విడతగా రూ. లక్ష ఇవ్వనుంది. మిగతా 2లక్షల రూపాయలను మరో రెండు విడతల్లో అందజేయనుంది. గృహలక్ష్మి పథకానికి జిల్లా వ్యాప్తంగా 67,123 దరఖాస్తులు వచ్చాయి. మూడు దరఖాస్తులు మినహా పరిశీలన ప్రక్రియను పూర్తి చేశారు. 50,847మందిని అర్హులుగా గుర్తించారు. 16,276 మందిని అనర్హులుగా గుర్తించారు. ఒక్కో నియోజకవర్గంలో 3వేల మందికి గృహలక్ష్మి పథకాన్ని అమలు చేయనున్నారు. ఈ లెక్కన జిల్లా వ్యాప్తంగా 12వేల మందికి మొదటి విడతలో లబ్ధి చేకూరనుంది. ఇప్పటికే ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఇందుకు సంబంధించిన జాబితాను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపినట్లు సమాచారం. అయితే అధికారులు చెబుతున్న దాని ప్రకారం మొదటి విడతలో ఒక్కో నియోజకవర్గం నుంచి 1,390 మందికే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే 3వేల మందిలో సగం మందికి కూడా గృహలక్ష్మి అందే అవకాశం లేదు. ఇదిలా ఉండగా కేవలం మూడు రోజుల గడువు కారణంగా జిల్లాలో చాలా మంది పేదలు గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేయలేకపోయారు.



వ్రతం.. వైభవం

వికారాబాద్ పట్టణ సమీపంలోని అనంతగిరి అనంత పద్మనాభ స్వామి ఆలయంలో అనంత చతుర్దశిని పురస్కరించుకుని గురువారం అనంత వ్రతాలను ఘనంగా నిర్వహించారు. ఈ వ్రతం ఆచరిస్తే 14 సంవత్సరాల పాటు చేయాల్సి ఉంటుందని అర్చకులు తెలిపారు. 185 మంది దంపతులు వ్రతమాచరించారు. తెలంగాణ జిల్లాలతోపాటు కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ పద్మనాభం, ఈవో నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

– అనంతగిరి



విశేష అలంకరణలో అనంత పద్మనాభస్వామి



కల్యాణ వేడుకకు హాజరైన భక్తజనం

రాజకీయ భిక్ష పెట్టిన కాంగ్రెస్‌కే ద్రోహం

- వచ్చే ఎన్నికల్లో రోహిత్‌రెడ్డికి గుణపాఠం తప్పదు
- పీసీసీ ప్రధాన కార్యదర్శి థారాసింగ్ జాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న థారాసింగ్ జాదవ్

తాండూరు: రాజకీయ భిక్షపెట్టిన కాంగ్రెస్ పార్టీకే ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ద్రోహం చేశారని, వచ్చే ఎన్నికల్లో ప్రజల చేతిలో గుణపాఠం తప్పదని పీసీసీ ప్రధాన కార్యదర్శి థారాసింగ్ జాదవ్ పేర్కొన్నారు. గురువారం తాండూరులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు హబీబ్‌లాలతో కలసి విలేకరులతో మాట్లాడారు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంతో శ్రమించి మంత్రి మహేందర్‌రెడ్డిపై రోహిత్‌రెడ్డిని గెలిపించడం జరిగిందన్నారు. 70 వేల మంది ఓటర్లను మోసం చేసి రాత్రికి రాత్రే రోహిత్‌రెడ్డి బీఆర్‌ఎస్‌లో చేరారన్నారు. మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిని విమర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కేఎల్‌ఆర్ సేవా కార్యక్రమాలను అబ్దుల్‌కలామ్ సైతం అభినందించారని గుర్తుచేశారు. అలాంటి వ్యక్తిని తాండూరు నుంచి తరిమేస్తామని మాట్లాడడం దారుణమన్నారు. ఓటమి భయంతోనే కేఎల్‌ఆర్‌పై విమర్శలు చేస్తున్నారని అన్నారు. నిన్నామొన్నటి వరకు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి మంత్రి మహేందర్‌రెడ్డిని విమర్శించారని, ప్రస్తుతం రాజకీయ అవసరాల కోసం ఇద్దరు కలిసి డ్రామాలు ఆడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తాండూరు ప్రజలు వారిని నమ్మడం లేదన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఉత్తమ్‌చంద్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలోనే ప్రతి గ్రామం అభివృద్ధి చెందిందన్నారు. కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 5 గ్యారంటీ స్కీమ్‌లను విజయవంతంగా అమలు చేస్తోందన్నారు. తాండూరు అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి సవాల్ విసిరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు హబీబ్‌లాల, యాలాల మండల అధ్యక్షులు నర్సిరెడ్డి, పెద్దేముల్ మండల అధ్యక్షుడు గోపాల్, తాండూరు మండల అధ్యక్షుడు నాగప్ప, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అలీం, నాయకులు ఎల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తెలంగాణలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే

మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్



ప్రసాద్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

మోమిన్‌పేట: రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ దీమా వ్యక్తం చేశారు. గురువారం మోమిన్‌పేట మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన నాయకులు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ ఆధ్వర్యంలో ప్రసాద్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ 6 గ్యారెంటీలతో ఎన్నికల బరిలో దిగుతుందన్నారు. బీఆర్‌ఎస్‌కు తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శుభాష్‌గౌడ్, సురేందర్, మహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఒగ్గు మల్లయ్య, చంద్రయ్య, మాణయ్య, మన్మోహన్ గౌడ్, నరేందర్ గౌడ్, గోపాల్‌రెడ్డి, పరమేష్, బస్వరాజ్, ప్రభాకర్, సిరాజుద్దీన్, ఎరాజ్ తదితరులు ఉన్నారు.

వైన్స్‌షాపుల పైకప్పు తొలగించి చోరీ



షాపు పైకప్పు తొలగించిన దృశ్యం

బషీరాబాద్: మండల కేంద్రంలోని రెండు వైన్స్ షాపుల్లో చోరీ జరిగినట్లు ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపారు. మణికంఠ, వినాయక వైన్‌షాపులకు ఎప్పటిలాగే బుధవారం రాత్రి 10గంటల సమయంలో యజమానులు బంద్ చేసి షట్టర్‌లకు తాళాలు వేసి వెళ్లారు. గురువారం ఉదయం షాపు తెరిచి చూడగా పైకప్పు రేకులు తొలగించినట్లు గుర్తించారు. రెండు షాపుల్లోని గల్లాల్లో ఉన్న నగదును దుండగులు ఎత్తుకెళ్లినట్లు యజమానులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మందుబాటిళ్లు ఒక్కటి కూడా చోరీకి గురికాకపోవడం గమనార్హం. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వైద్యం అందక ఆవు మృతి

పూడూరు: సకాలంలో వైద్యం అందక ఆవు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని పోతిరెడ్డిగూడలో చోటు చేసుకుంది. బాధిత రైతు అంజయ్య మాట్లాడుతూ తన ఆవు బుధవారం అనారోగ్యానికి గురైందని తెలిపారు. సంచార వాహనాకి ఫోన్‌చేస్తే పట్టించుకోలేదని.. గురువారం ఉదయం చనిపోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు, సకాలంలో వైద్యం అంది ఉంటే తన ఆవు బతికేదని విలపించాడు. న్యాయం చేయాలని కోరారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



అనంతగిరి: వికారాబాద్ రైల్వే పరిధిలోని కొత్తగాడి కామారెడ్డి గూడెం మధ్యలో ఉన్న 150 బై 11 కిలోమీటర్ మధ్యలో ఓ గుర్తుతెలియని మృతదేహం లభించిందని రైల్వే పోలీసులు గురువారం తెలిపారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు కానీ ఐడీ కార్డులు గానీ లభించలేదు. రెడీమేడ్ పాయింట్ ధరించి ఉన్నాడు. ఫొటోలోని వ్యక్తిని గుర్తించిన వారు ఫోన్ నంబర్ 84669 38351, 99893 55134 లలో సంప్రదించాలని తెలిపారు.

బైక్‌కి వెల్డింగ్ చేస్తుండగా..

షాద్‌నగర్‌రూరల్ : ద్విచక్రవాహనానికి మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుంది. స్థానికులు వెంటనే స్పందించడంతో ప్రమాదం తప్పింది. వివరాలిలా ఉన్నాయి. మండల పరిషత్ కార్యాలయం దుకాణ సముదాయం కాంప్లెక్స్ సమీపంలో గ్యాస్ వెల్డింగ్ షాపులో ద్విచక్ర వాహనానికి గ్యాస్ వెల్డింగ్ చేస్తుండగా బైక్‌కు నిప్పు అంటుకుంది. దీంతో మంటలు చెలరేగాయి. చుట్టుపక్కలవారు వెంటనే స్పందించి నీళ్లు పోయడంతో ఎవరకీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

నాణ్యతకు తిలోదకాలు

- నాసిరకంగా ప్రభుత్వ బడుల పునఃనిర్మాణ పనులు
- అధికారుల పర్యవేక్షణ లోపంతో కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం



నాసిరకం సిమెంట్‌తో బండలు వేస్తున్న కార్మికుడు



రుక్మాపూర్ పాఠశాల భవనానికి బీటలు

పెద్దేముల్: ప్రభుత్వ పాఠశాలల భవనాల పునఃనిర్మాణ పనులు అధికారుల నిర్లక్ష్యంతో నాసిరకంగా మారుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ బడుల అభివృద్ధికి రూ.కోట్లు ఖర్చుపెడుతున్నా క్షేత్రస్థాయిలో అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల కక్కుర్తితో పనుల్లో నాణ్యత ఉండటంలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయమై ఫిర్యాదు చేసినా ఉన్నతాధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు. పెద్దేముల్ మండలంలోని రుక్మాపూర్ ప్రాథమిక పాఠశాల భవనం మరమ్మతులకు మండల నిధులతో పాటు, 15వ ఆర్థిక సంఘం నుంచి సుమారు రూ.6లక్షల రుపాయలను ప్రభుత్వం మంజూరు చేసింది.

కాంట్రాక్టర్‌తో కుమ్మక్కు..

ఆ నిధులతో పాఠశాల గదులు, వరండాల్లో పాలిషింగ్ బండలు వేయడంతో పాటు ఇతర పనులు చేయాల్సి ఉంది. అయితే కాంట్రాక్టర్ పనులు నాసిరకంగా చేపడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. నాసిరకం లూజ్ సిమెంట్, నాసిరకం ఇసుక వేసి తూతూమంత్రంగా పనులు చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. పంచాయతీరాజ్ అధికారులు కాంట్రాక్టర్‌తో కుమ్మక్కయ్యారని ఆరోపణలున్నాయి. ఇప్పటికే ఆ పాఠశాల భవనం గోడలు కూడా బీటలు వారాయి. ఉన్నతాధికారులు తనిఖీలు చేసి నాణ్యత లేని పనులకు బిల్లులు రద్దు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఎంపీడీఓ లక్ష్మప్ప దృష్టికి తీసుకెళ్లగా.. చేపడుతున్న పనులను పరిశీలించి నాణ్యత లేకుంటే బిల్లులు నిలిపివేస్తామన్నారు.

> **బిల్లులు నిలపివేస్తాం**
>
> రుక్మాపూర్ పాఠశాలలో చేపడుతున్న పనులు నాణ్యతగా ఉండాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు పలుమార్లు తెలియజేశాం. నాణ్యత లేని సిమెంట్, సామగ్రి వాడితే తప్పకుండా చర్యలు తీసుకుంటాం. కాంట్రాక్టర్ బిల్లులు నిలపివేస్తాం.
>
> – సిద్దార్థ, పంచాయతీరాజ్ ఏఈ, పెద్దేముల్

భూమికి పచ్చాని రంగేసినట్టు..

ఇదేదో కోనసీమ ప్రాంతం అనుకుంటున్నారు కదూ..! అయితే మీరు పొరపాటు పడ్డట్టే. బషీరాబాద్ మండలం మైల్వార్ గ్రామ అక్కలమ్మ, యెల్లమ్మ చెరువుల ఆయకట్టు ఇది. చుట్టూ కొండల మధ్య కనుచూపుమేర పరుచుకున్న ఆయకట్టు ప్రాంతం వరినాట్లు వేయడంతో భూమికి పచ్చటి రంగేసినట్లు ఆహ్లాదాన్ని పంచుతోంది. అటుగా వెళ్లే ప్రయాణికులకు కోనసీమలో వెళ్తున్న అనుభూతి కలుగుతుంది.

– బషీరాబాద్



మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలి

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



కేశంపేట: చెరువులో చేపపిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కేశంపేట: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. మండలంలోని 26 చెరువులకు గాను గురువారం 6లక్షల 30వేల చేపపిల్లల పంపిణీని జిల్లా మత్స్యశాఖ అధికారి సుకీర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ హాజరై చేపపిల్లలను చెరువుల్లో వదిలారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ ఏసుదాసు, అసిస్టెంట్ అంబేడ్కర్, ఫిషర్‌మ్యాన్లు యాదగిరి, మహేందర్, కొత్తపేట, కేశంపేట గ్రామాల సర్పంచ్‌లు నవీన్‌కుమార్, వెంకట్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు జమాల్‌ఖాన్, లక్ష్మీనారాయణగౌడ్, మల్లేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దైవచింతన అలవర్చుకోవాలి

కొత్తూరు: ప్రతి ఒక్కరు దైవ చింతన అలవర్చుకోవాలని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. మండల పరిధిలోని పెంజర్లలో అనంత పద్మనాభ స్వామి ఆలయంలో గురువారం నిర్వహించిన స్వామివారి జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీలత, మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ అనితారెడ్డి, నాయకులు సత్యనారాయణ, జనార్దన్ రెడ్డి, నారాయణరెడ్డి, మధుసూదన్‌రావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జేపీ దర్గాలో..

మండల పరిధిలోని జహాంగీర్ పీర్ దర్గాలో మిలాద్ ఉన్ నబీ పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ హాజరై దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు, బీఆర్‌ఎస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గుండెపోటుతో శ్రీరామ్ చిట్స్ ఉద్యోగి మృతి



పాట్ నాయక్ (ఫైల్)

చేవెళ్ల: గుండెపోటుతో శ్రీరామ్ చిట్స్ రికవరీ మేనేజర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన కేవీజీ పాట్ నాయక్(54) రెండు సంవత్సరాల నుంచి చేవెళ్లలోని శ్రీరామ్ చిట్స్‌లో రికవరీ మేనేజర్‌గా పనిచేస్తూ చేవెళ్లలోని చంద్రారెడ్డినగర్‌లో ఓ గదిలో అద్దెకు ఉంటున్నాడు. అతనికి వివాహం కాలేదు ఒక్కడే ఉంటున్నాడు. గత కొన్నిరోజులుగా గుండె సమస్యతోపాటు బీపీ, షుగర్ అనారోగ్య సమస్యలు ఉన్నట్లు తెలిపారు. సోమవారం ఆఫీస్‌కు వచ్చి వెళ్లిన తరువాత ఆరోజు సాయంత్రం నుంచి అతడు ఎవరి ఫోన్ రిసీవ్ చేయలేదు. బుధవారం రాత్రి అతని ఇంటికి కొందరు వచ్చి చూస్తే లోపలనుంచి గడియ పెట్టి ఉంది. కిటీలోనుంచి చూడగా గదిలో మంచంపై చనిపోయి పడి ఉన్నాడు. పోలీసులు వచ్చి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గురువారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వీరబ్రహ్మం తెలిపారు.

నేడు ఉచిత కుట్టు మెషీన్ల పంపిణీ

కడ్తాల్: కడ్తాల్‌లోని ఎంబీఏ గార్డెన్‌లో శుక్రవారం ఉదయం 10గంటలకు ముస్లిం మైనార్టీ మహిళలకు ఉచిత కుట్టుమెషీన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పీఏ నరేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరౌతారన్నారు. కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని కడ్తాల్, ఆమనగల్లు, మాడ్గుల్, తలకొండపల్లి మండలాలకు సంబంధించిన లబ్ధిదారులు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు

చేవెళ్ల: చేవెళ్లలో నేటినుంచి మూడురోజుల పాటు ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఏఎస్.రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చేవెళ్ల మండలానికి చెందిన యువత, ప్రజలకు 1000 మందికి మూడు రోజుల పాటు ఉచిత శిక్షణతో పాటు ఇంగ్లీష్ మెటీరియల్ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. చేవెళ్ల మండలంలోని వివేకానంద ఇంటర్‌నేషనల్ స్కూల్ పక్కనే ఉన్న సిద్ధార్థ బీఈడీ కళాశాల భవనంలో శిక్షణ తరగతలు ఉంటాయనిచెప్పారు. వయస్సుతో నిమిత్తం లేకుండా అందరూ పాల్గొనవచ్చునని తెలిపారు. మరిన్ని వివరాలకు 95506 41058 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

బావిలో పడి వ్యక్తి మృతి

శంకర్‌పల్లి: బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని లక్ష్మారెడ్డిగూడ గ్రామానికి చెందిన దెబ్బడి నర్సింహులు(65) గురువారం నిమజ్జనం సందర్భంగా వినాయకుడి విగ్రహాన్ని బావిలో స్నానం చేయించడానికి గ్రామస్తులతో కలిసి వెళ్లాడు. విగ్రహాన్ని స్నానం చేయించిన అంతరం నర్సింహులు బావిలో ఈత కొడుతుండగా బావిలోనే మునిగి మృతి చెందాడు. మద్యం సేవించి ఈత కొట్టడంతోనే మృతి చెందినట్లు తెలిసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపు తప్పి.. ఒకరి దుర్మరణం

షాబాద్: రోడ్డు ప్రమాదంలో బీఆర్‌ఎస్ నాయకుడు మృతి చెందిన సంఘటన షాబాద్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. సీఐ యాదయ్యగౌడ్ తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని అంతారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు సురేందర్‌రెడ్డి(42) గురువారం బైక్‌పై సంకెపల్లిగూడ నుంచి షాబాద్ వైపు వస్తుండగా బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ప్రీకాస్ట్ గోడకు ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్ర గాయాలైన సురేందర్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

కిరాణా దుకాణంలో మద్యం విక్రయం

నిందితుడి అరెస్టు,

95 మద్యం సీసాలు స్వాధీనం

అబ్దుల్లాపూర్‌మెట్: నిమజ్జనాలను పురస్కరించుకుని మద్యం దుకాణాలను మూసివేయాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నప్పటికీ మద్యం విక్రయిస్తున్న ఓ కిరాణా దుకాణంపై పోలీసులు దాడి చేశారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. మండల కేంద్రంలోని జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో పత్లావతి శంకర్‌నాయక్ కిరాణా దుకాణం నిర్వహించడంతో పాటు మద్యం నిల్వలు ఉంచి అధిక ధరకు విక్రయిస్తున్నాడు. పక్కా సమాచారంతో గురువారం పోలీసులు దుకాణంపై దాడిచేసి మొత్తం 95 మందుబాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేశారు. బెల్టుషాపులపై ఉక్కుపాదం మోపుతామన్నారు.

హష్ ఆయిల్ పట్టివేత

చేవెళ్ల: విశాఖపట్నం నుంచి హష్ ఆయిల్‌ను తరలిస్తున్న వ్యక్తిని ఎస్‌ఓటీ పోలీసులు, చేవెళ్ల పోలీసులు కలిసి పట్టుకున్నారు. అతని నుంచి రూ.15లక్షల విలువ చేసే లిక్విడ్ను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన చేవెళ్లలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ లక్ష్మారెడ్డి కథనం ప్రకారం.. విశాఖపట్నం జిల్లా పెద్దవెల్లి మండలం, మల్లేపెట్టు గ్రామానికి చెందిన పొత్రంగి రత్నం, అదే జిల్లాలోని బొర్రనేరోడు గ్రామానికి చెందిన బాబురావు(33) హష్ ఆయిల్‌ను తయారుచేసి హైదరాబాద్‌లో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈనెల 25న పాడేరులో కలుసుకున్న వీరు లిక్విడ్‌ను అమ్మే విషయం చర్చించారు. ఒప్పందం ప్రకారం బాబురావుకు 3 కిలోల ఆయిల్ ఇచ్చి హైదరాబాద్‌లో అమ్మకొని రావాలని చెప్పిన రత్నం అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు విజయవాడలో దింపాడు. ఆ రోజు రాత్రికి అక్కడే ఉండి మరుసటిరోజు హైదరాబాద్ వెళ్లమని చెప్పి వెళ్లిపోయాడు. బాబురావు లిక్విడ్‌ను తీసుకొని 26న సాయంత్రం హైదరాబాద్‌లోని మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌కు వచ్చాడు.

పోలీసులకు చిక్కాడిలా..

వినాయక నిమజ్జనాల సందర్భంగా భారీ పోలీస్ బందోబస్తు ఉన్నట్లు గమనించిన బాబురావు హైదరాబాద్‌లో అమ్మడం కుదరదని సమీపంలోని నగరాల్లో అమ్ముకోవాలని భావించాడు. 27న హైదరాబాద్ నుంచి బస్సులో చేవెళ్లకు వచ్చాడు. చుట్టుపక్కల ఎక్కడైనా అమ్ముకోవాలని బ్యాగులో ఆయిల్‌ను పెట్టుకొని తిరుగుతున్నాడు. అప్పటికే రాజేంద్రనగర్ ఎస్‌ఓటీ పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారంతో చేవెళ్ల పోలీసుల సహకారంతో చేవెళ్ల మార్కెట్ యార్డు సమీపంలో తిరుగుతున్న అతన్ని పట్టుకున్నారు. విచారించగా పొంతన లేని సమాధానాలు చెప్పటంతో అతని బ్యాగ్‌ను తనిఖీ చేయగా లిక్విడ్‌ను గుర్తించారు. అతని నుంచి ఆయిల్‌తోపాటు సెల్‌ఫోన్, పర్సును స్వాధీనం చేసుకున్నారు. అతన్ని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ లక్ష్మారెడ్డి తెలిపారు. రాజేంద్రనగర్ డీసీసీ జగదీశ్వర్‌రెడ్డి, చేవెళ్ల ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి పర్యవేక్షణలో చేవెళ్ల పోలీసులు, ఎస్‌ఓటీ పోలీసులు కలిసి కేసును ఛేదించినట్లు చెప్పారు.

ఆత్మీయ సమ్మేళనం రసాభాస

మున్సిపల్ ఛైర్మన్‌తో బీఆర్‌ఎస్ నేతల వాగ్వాదం



ఛైర్మన్ మధుమోహన్‌ను సముదాయిస్తున్న పోలీసులు

తుక్కుగూడ: తుక్కుగూడ మున్సిపాలిటీ రావిర్యాలలో కులసంఘాల ఆత్మీయ సమ్మేళనాన్ని గురువారం నిర్వహించారు. ఈ సభకు మంత్రి సబితారెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కార్తీక్‌రెడ్డి హాజరయ్యారు. సభా వేదిక వద్దకు తుక్కుగూడ మున్సిపల్ ఛైర్మన్ కాంటేకర్ మధుమోహన్, బీజేపీ 1వ వార్డు కౌన్సిలర్ బోధ యాదగిరిరెడ్డి వచ్చారు. సభకు తాను అధ్యక్షత వహిస్తానని ఛైర్మన్ పట్టుబట్టారు. ఇది ప్రభుత్వం కార్యక్రమం కాదని.. ఆత్మీయ సమ్మేళనం అని బీఆర్‌ఎస్ నాయకులు పేర్కొన్నారు. ఈ విషయమై బీఆర్‌ఎస్ నాయకులు, ఛైర్మన్, కౌన్సిలర్ మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి సభ నుంచి ఛైర్మన్, కౌన్సిలర్‌ను బయటికి పంపిచారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

కొందుర్గు: నిరుద్యోగ యువతీయువకుల నుంచి వృత్తివిద్యా కోర్సుల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లేడ్ చౌదరిగూడ ఎంపీడీఓ మహేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులై 19 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న నిరుద్యోగులు అర్హులన్నారు. అక్టోబర్ 3వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఎస్‌బీఐ రూరల్ ఎంప్లాయిమెంట్ ఆధ్వర్యంలో కార్ డ్రైవింగ్, సీసీ టీవీ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తిగల వారు సంబంధిత సర్టిఫికెట్లతో చిలుకూరులోని గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ వద్ద హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 85001 65190, 79819 51167 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

భగత్‌సింగ్ సేవలు మరువలేనివి

ఎమ్మెల్యే యాదయ్య



భగత్‌సింగ్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

చేవెళ్ల: దేశ స్వాతంత్రం కోసం భగత్‌సింగ్ ప్రాణ త్యాగం చేశారని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల కేంద్రంలోని భగత్‌సింగ్ కాలనీ సమీపంలో ఉన్న భగత్‌సింగ్ విగ్రహం వద్ద ఆయన జయంతి వేడుకలను భగత్‌సింగ్ యూత్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పార్టీలకతీతంగా నాయకులు పాల్గొని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీపీ ఎం.విజయలక్ష్మి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ వెంకటరంగారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు యాదగిరి, నాగార్జున్‌రెడ్డి, క్రిష్ణ, చంద్రశేఖర్, నర్సింహులు, మానిక్యరెడ్డి తదితరులు ఉన్నారు. బీజేపీ నాయకులు అత్తెల్లి అనంత్‌రెడ్డి, కుంచం శ్రీనివాస్, ప్రవీన్‌రెడ్డి, అభిలాష్‌రెడ్డి, కాంగ్రెస్‌పార్టీ నాయకులు చేవెళ్ల సర్పంచ్ బండారి శైలజ, పీఏసీఎస్ ఛైర్మన్ డి.వెంకట్‌రెడ్డి, సమత, మధుసుధన్‌గుప్తా, గంగి యాదయ్య, రాములు, దామోదర్‌రెడ్డి, శ్రీనివాస్, సాయి, భగత్‌సింగ్‌కాలనీవాసులు పాల్గొన్నారు.

మళ్లీ మాదే అధికారం

- పరిశ్రమల ఏర్పాటుతో మారుతున్న షాబాద్ రూపురేఖలు
- సీతారాంపూర్ సీతారామచంద్రస్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేసుకుందాం
- ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్



సీతారంపూర్ వద్ద బీఆర్‌ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్

షాబాద్: రెండు నెలల తర్వాత తిరిగి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. మండల పరిధిలోని సీతారాంపూర్, చందనవెళ్లి గ్రామాల్లోని పారిశ్రామికవాడలో పలు కంపెనీలకు శంకుస్థాపనలు చేసేందుకు గురువారం ఆయన హాజరయ్యారు. సీతారాంపూర్ వద్ద జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. సీతారంపూర్ చౌరస్తా వద్ద సమాచార, పౌరసంబంధాలు, గనులశాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, జెడ్పీచైర్‌పర్సన్ అనితారెడ్డి, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, పైలెట్ రోహిత్‌రెడ్డితో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. చందనవెళ్లి, సీతారాంపూర్ పరిశ్రమల్లో తయారు చేసే టైల్స్ ప్రపంచం నలు మూలలా సరఫరా కావడం గొప్ప పరిణామమన్నారు. చందనవెళ్లిలో చిన్న ప్లాట్ల సమస్య ఉందని, దానిని త్వరలో పరిష్కరించుకుందామన్నారు. సీతారాంపూర్ సీతారామచంద్రస్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేసుకుందామన్నారు. యువతకు స్థానికంగా ఉద్యోగావకాశాలు కల్పించాలనే ఉద్దేశంతోనే సీఎం కేసీఆర్ ఈ ప్రాంతాన్ని పారిశ్రామిక హబ్‌గా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇక్కడ నాలుగు కాదు 40, 50 పరిశ్రమాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మరో ఐదేళ్లలో షాబాద్ మండలం ఎంతో అభివృద్ధి జరుగుతుందన్నారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యను మరోసారి అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. దేశం మొత్తం షాబాద్ వైపు చూస్తోందన్నారు. ఎక్కడా లేని అభివృద్ధి పరిశ్రమల ద్వారా ఇక్కడ జరుగుతోందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు శ్రీకాంత్, మాలతి, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ గూడూరు నర్సింగ్‌రావు, సహకార సంఘం ఛైర్మన్ శేఖర్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు మధసూదన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మద్దూర్ మల్లేష్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

పాలమూరు సభతోనే ఎన్నికల శంఖారావం

షాద్‌నగర్: ప్రధాని మోదీ పాలమూరు పర్యటనలో భాగంగా నిర్వహించనున్న సభ నుంచి ఎన్నికల శంఖారావాన్ని పూరించబోతున్నారని బీజేపీ నాయకుడు మిథున్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మిథున్‌రెడ్డి మాట్లాడారు. పాలమూరులో ఏర్పాటుచేసే సభ 2023 ఎన్నికల శంఖారావం సభ అన్నారు. పాలమూరు బహిరంగ సభను విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. సభకు కనీసం లక్షన్నర మందిని తరలించేందుకు జనసమీకరణ చేయనున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీ నుంచి 15వేల మందిని తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ సభతో సీఎం కేసీఆర్‌కు పతనం ప్రారంభమవుతుందని అన్నారు. రాష్ట్రంలో బీజేపీ ఒక్క అవకాశం ఇవ్వాలని, డబుల్ ఇంజిన్ సర్కారుతో అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రజలకు దక్కుతాయని అన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు రుషికేశ్, మల్చలం మురళి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని సభను విజయవంతం చేయండి

కొందుర్గు: పాలమూరు ప్రజా గర్జన పేరున మహబూబ్‌నగర్‌లో అక్టోబర్ 1న నిర్వహించే సభను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య పిలుపునిచ్చారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్రం ఇచ్చిన నిధులతో రాష్ట్ర ప్రభుత్వం పనులు చేపడుతూ కేంద్ర ప్రభుత్వం నిధులివ్వడం లేదని బీఆర్‌ఎస్ నాయకులు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. చౌదరిగూడ మండల కేంద్రంలో బీజేపీ నేత శ్రీవర్ధన్ రెడ్డి సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు పటేల్ ప్రభులింగం, బోయ శంకర్, అంజయ్య, నరేష్, యాదయ్య, శ్రీనివాసు, కిరణ్‌కుమార్, శేఖర్, వీరయ్య, శ్రీనివాసు, వినోద్, శ్రీకాంత్, హరీష్, శివ, శంకర్, వంశీ పాల్గొన్నారు.

నందిగామ/కేశంపేట: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో అక్టోబర్ 1న బీజేపీ తలపెట్టిన పాలమూరు ప్రజాగర్జన బహిరంగసభకు ప్రతీ బూత్ నుంచి కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావలాని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దేపల్లి అశోక్‌గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం పార్టీ చేగూరు మండల అధ్యక్షుడు సుధాకరప్ప ఆధ్యక్షతన గురువారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ విచ్చేయనున్న ఈ సభను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులంతా సమన్వయం చేసుకుని విజయవంతం చేయలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యం, రాజు, విశ్వనాథం, సత్తయ్య, లక్ష్మయ్య, బండి శ్రీను, శ్రీశైలం, ఈశ్వరయ్య, జంగయ్య,ప్రభాకర్, ప్రశాంత్, ప్రవీన్, అమృత పాల్గొన్నారు.

కొత్తూరులో

మండల కేంద్రమైన కొత్తూరులో బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు మల్‌రెడ్డి మహేందర్ రెడ్డి అధ్యక్షతన కార్యకర్తల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈసమావేశంలో పాల్గొన్న పార్టీ సీనియర్ నాయకుడు కమ్మరి భూపాల చారి మాట్లాడుతూ.. మోదీ సభను విజయవంతం చేయుటకు ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మాణిక్యం, వెంకటేశ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.